క్లుప్తంగా

దర్గాకు తరలివచ్చిన భక్తులు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాష చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులకు ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనం ఆవరణలో శుక్రవారం.. ఉపాధి హామీ పథకం పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలకు సంబంధించి బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఓ విజయ మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ సిసిరాదీప్తి

ఆదోని అర్బన్: పెండింగ్‌లో ఉన్న చలానా సొమ్మును ఈ–చలాన్ డాట్ పరివాహన్ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సిసిరా దీప్తి, అసిస్టెంట్ ఎంవీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. గతంలో ఆన్‌లైన్ డబ్బు చెల్లించాలంటే ఓటీఎస్‌బీసీఆర్ ద్వారా చేసే వారన్నారు. ప్రస్తుతం ఈ–చలాన్ చేయడం ద్వారా భారతదేశంలో ఎక్కడైనా చెల్లించిన రశీదును చూపిస్తే సరిపోతుందన్నారు. ఈ–చలానా అనేది కేంద్రానికి చెందిందని, గతంలో రాష్ట్రానికి సంబంధించిందన్నారు. ఏదైనా వాహనాలపై కేసులు గానీ, సీజ్ చేసినా నేరుగా ఢిల్లీకి వెళ్తుందన్నారు. కేసులు, సీజ్ అయిన వాహనాలు మరలా రోడ్లపై తిరగాలంటే ఢిల్లీలోని రవాణాశాఖ అధికారులే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వాహనదారులు సదరు వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి ఆన్‌లైన్ పేమెంట్ చేయాలని సూచించారు.

నేడు వేలం పాటలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఒక సంవత్సరం పాటు టెంకాయలను సరఫరా చేసేందుకు గాను శుక్రవారం (నేడు) వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్. వెంకటేశ్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. ఏడాది పాటు టెంకాయల సరఫరాతో పాటు కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుల కోసం వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే దేవాలయం వద్ద జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి కూరగాయల సరఫరా, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ హక్కులు, పారిశుద్ధ్య నిర్వహణ హక్కులు, చెప్పుల స్టాండ్ నిర్వహణ హక్కుల కోసం టెండర్లు పిలిచినట్లు తెలిపారు. అలాగే స్వామి వారికి నిత్యం పూజల కోసం పూలు, అగర్‌బత్తిల సరఫరా కోసం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

శ్రీమఠంలో ఆదోని జడ్జి



శ్రీమఠం ప్రాంగణంలో న్యాయమూర్తి పీజే సుధ

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై ఆదోని అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పీజే సుధ గురువారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా మంచాలమ్మను దర్శించుకుని అర్చన సహిత హారతులు పట్టారు. రాఘవేంద్ర మూల బృందావనం చేరుకుని విశేష పూజలు చేశారు. వారికి మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

కర్నూలు(అర్బన్): నందవరం మండలం జొహరాపురం గ్రామంలో కురువ మల్లేష్, నాగేంద్ర, పరమేష్, సరస్వతమ్మ, రాములమ్మపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని కురువ సంఘం జిల్లా నేతలు కోరారు. దాడిలో గాయపడి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సంఘం నాయకులు తవుడు శ్రీనివాసులు, బీసీ తిరుపాలు, పుల్లన్న, రాయలసీమ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ తదితరులు పరామర్శించారు. పొలం విషయంలో సంజీవరెడ్డి, బాలురెడ్డి, అర్జున్‌రెడ్డి, రాఘవరెడ్డి, రామక్రిష్ణారెడ్డి తదితరులు తమను కొడవళ్లు, రాడ్లు, కర్రలతో తీవ్రంగా గాయపరిచారని బాధితులు నాయకులకు విన్నవించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వారు డాక్టర్లను కోరారు.

విద్యను వ్యాపారంగా మార్చిన కేంద్రం

ఆదోని సెంట్రల్: నీట్, నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలో గురువారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీఎస్ఎఫ్, ఆర్‌పీఎఫ్ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి దస్తగిరి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అఖండ మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్షల నిర్వహణలో విఫలం చెందిన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలన్నారు. అంతకుముందు విద్యా సంస్థలను బంద్ చేయించి పట్టణంలోని ప్రధాన రోడ్లపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆయా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి వైఎస్సార్ సర్కిల్ వద్దకు చేరుకుని ధర్నా చేశారు. ఆయా సంఘాల నాయకులు విజయేంద్ర, మహేంద్రబాబు, వీరేష్‌యాదవ్, విజయ్, రాజు మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీపై రాష్ట్ర ప్రభుత్వం నోరువిప్పకపోవడం శోచనీయమన్నారు. విద్యను వ్యాపారం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఆదోని భీమాస్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



ఎమ్మిగనూరు వైఎస్సార్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కోసిగి: కోసిగిలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బాలుర, బాలికల, ఏపీ మోడల్ స్కూల్‌లతో పాటు, ప్రాథమిక, ప్రైవేట్ పాఠశాలల ఎదుట నిరసన తెలిపి బంద్ చేయించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పత్రం లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌లకు అందజేశారు.

గోనెగండ్ల: నీట్, యూజీసీనెట్ పరీక్షలను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు మునిస్వామి, రంగస్వాములు డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 లక్షలు వసూలు చేసి పేపర్ లీక్ చేసినట్లు నిందితులు అంగీకరించినా ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కోసిగి బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

'ఎమ్మెల్యేవి ఒట్టి మాటలే.. అభివృద్ధి లేదు'



కోట్ల కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలో బీజేపీ తరఫున డాక్టర్ పార్థసారథి ఎమ్మెల్యేగా గెలిచి నెల రోజులవుతున్నా తాట తీస్తా, అభివృద్ధి ముఖ్యమంటూ ఒట్టి మాటలు చెబుతున్నారని, అభివృద్ధి చేయడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆదోని ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్ ఎద్దేవా చేశారు. గురువారం స్థానిక కోట్ల కూడలిలో బీజేపీకి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఒక్క శాతం కూడా అభివృద్ధి జరగలేదని, నెల రోజులైనా ఎమ్మెల్యే కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేకపోయారన్నారు. ఏదైనా సమస్య వస్తే తనకు ఫోన్ చేయాలని చెబుతున్న ఎమ్మెల్యే ఫోన్ ఎత్తడం లేదని వాపోయారు. పట్టణంలో సారా, అక్రమ మద్యం, మట్కా విచ్చలవిడిగా జరుగుతున్నా ఎమ్మెల్యే స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అభివృద్ధి చేస్తారని నమ్మి ప్రజలు అధికారం కట్టబెడితే కేవలం బెదిరించడానికే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. నాయకులు దిలీప్‌దోకా, మారుతి, దేవిశెట్టి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని టౌన్: ఎవరికీ భయపడొద్దు, నిజాయితీగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వార్డు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో సచివాలయం ఉద్యోగులు, మున్సిపల్ శానిటరీ ఉద్యోగులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే పూర్తిస్థాయిలో విచారణ చేసి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కూటమి నాయకులమంటూ ఎవరైనా వచ్చి వేధింపులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలని ఉద్యోగులకు సూచించారు. సచివాలయాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కొంతమంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటివారు పనితీరు మార్చుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంఈ చలపతిరావు, టీపీఓ శ్రీనివాసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మఠం భూములను కాపాడతా

ఆదోనిఅర్బన్: కల్లుమఠం భూములను కవచంలాగా కాపాడతానని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. గురువారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని కల్లుమఠంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి పీఠాధిపతి గురుసిద్ధదేవరుని ఆశీర్వాదాలను తీసుకున్నారు. మఠం నిర్వాహకులు, సభ్యులు సుగూరప్ప, దేశాయ్ చంద్రన్న, వీరేష్, మంజునాథ్, చెన్నబసప్ప, బద్రి తదితరులు పాల్గొన్నారు.

– 108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కోరారు.ఈ మేరకు గురువారం యూనియన్ నాయకులు కిరణ్‌కుమార్, నరసింహారావు, శ్రీనివాసరావు, మహేష్ తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

ఆదోని రూరల్: గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గోల్డెన్ జూబ్లీ హాల్‌లో వివిధశాఖల గ్రామస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ సచివాలయాల్లో టాయిలెట్స్ లేవని పలువురు లేవనెత్తగా వెంటనే మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధిలో సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకమన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ మంచిదే అయినప్పటికీ చిత్తశుద్ధితో పనిచేసి అభివృద్ధివైపు అడుగులు వేయాలన్నారు. మాజీ ఎంపీపీ బడాయి పంపాపతి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్, హౌసింగ్ డీఈ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల నిరసన



ఎమ్మిగనూరులో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును ఎండగడితే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ఆయన దిష్టిబొమ్మలను దహనం చేయడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఖాశింవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. రాహుల్‌గాంధీ కులాలను, మతాలను గౌరవిస్తారని, ఆయన వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజలు, రైతుల పక్షాన పోరాడే నేత రాహుల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దాదాఖలందర్, విష్ణు, షబ్బీర్,రఫీక్,హర్ష, లోకేష్, అన్సర్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్

కౌతాళం: మండల పరిధిలోని వల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేస్తూ డీఈఓ శ్యామ్యుల్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ శోభారాణి తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో గ్రామస్తులు ఇటీవల డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు నివేదికను డీఈఓకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు రుజువు కావడంతో సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ తెలిపారు.

బీసీల రక్షణకు చట్టం తేవాలి

ఆదోని టౌన్: బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు బీసీల రక్షణకు చట్టం తేవాలన్నారు. అలాగే బీసీలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. బీసీ హాస్టళ్లకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలని, ఉన్న వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓబీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డివిజన్ గౌరవ సలహాదారు దేవిశెట్టి ప్రకాష్, తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, ఆదోని పట్టణ ఉపాధ్యక్షుడు వడ్డె శ్రీనివాసులు, పట్టణ గౌరవ సలహాదారు డాక్టర్ యు.సోమశేఖర్, కపటి వీరభద్ర, మల్లేశ్వరప్ప, ఎం.ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటి పరిరక్షించాలని అప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతారని ఎంఈఓ–2 మధుసుదన్‌రాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జెడ్పీ పాఠశాల ఆవరణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల ఆవరణలోనూ, వారి ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాల్లో మొక్కలను పెంచాలని కోరారు. వ్యాయమ ఉపాధ్యాయురాలు సుజనకుమారి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితోనే వ్యాధులు

కౌతాళం: కలుషితమైన నీటిని సరఫరా వల్లనే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని జనసేన మండల నాయకుడు రామాంజనేయులు ఆరోపించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. కౌతాళంలో కలుషిత నీటినే కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా అధికారులు డయేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారని, కింది స్థాయి అధికారులు నీటిని ఫిల్టర్ చేయకుండా రా వాటర్ పంపింగ్ చేయడంతో ఆ నీటిని తాగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని వాపోయారు. అధికారులు చర్యలు చేపట్టి శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని, లేని పక్షంలో సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

గోనెగండ్ల: మండల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి కోరారు.గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశం భవనంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ఏయే శాఖలకు ఎంత నిధులు వచ్చాయని, ప్రజా సమస్యలు ఎంత వరకు పరిష్కరించారని అధికారులను నిలదీశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండలానికి మంజూరైన నిధులతో వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ సోనిబాయి, తహసీల్దార్ పార్వతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీధర్, గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్ కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. జీఓ 117ను రద్దు చేయాలని, ఐఆర్ 30 శాతం ఇప్పించాలని, ఉపాధ్యాయులును బోధనేతర పనులకు దూరంగా ఉంచాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

పొలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో పొలం విషయంలో రైతుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గురువారం ఎస్ఐ తిమ్మయ్య తెలిపిన వివరాల మేరకు.. గంగవరం గ్రామంలో సర్వే నెంబర్ 6/బి లో 60 సెంట్ల భూమి తమదంటూ రైతు మల్లేశ్వర రెడ్డి కుటుంబసభ్యులు, ఆ భూమి తమదంటూ మరో రైతు కురువ నాగరాజు కుటుంబ సభ్యులు గొడవ పడ్డారు. వాదోపవాదాలు చేసుకుని కర్రలతో దాడులకు దిగడంతో పలువురికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. గాయాలైన వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కొందరికి తీవ్ర రక్తస్రావం కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనలో మల్లేశ్వర రెడ్డి వర్గీయులు 13 మందిపై, కురువ నాగరాజు వర్గీయులు 17 మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

తప్పుడు కేసులో ఇరికించడం తగదు

ఆదోని టౌన్: ప్రేమ జంట వెళ్లిపోయిన వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా త్రీటౌన్ పోలీసులు తనతో పాటు తన తమ్ముడు రామాంజనేయులుపై కేసు పెట్టడం బాధాకరమన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్వన్‌పేటకు చెందిన చిరంజీవి అనే తనకు సమీప బంధువేనని, అయితే అతని ప్రేమ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. అక్రమ కేసులు బనాయిస్తే న్యాయం కోసం కోర్టుకు వెళ్తామని చెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవా

మాంసం వ్యాపారులు శుభ్రత పాటించాలి

ఎమ్మిగనూరుటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పట్టణంలో మాంసం విక్రయించే వ్యాపారులు శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మాంసం వ్యాపారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ప్రస్తుతం డయేరియా లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, దీన్ని నివారించేందుకు మాంసం విక్రయశాలల వద్ద ఈగలు వాలకుండా, అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలన్నారు. ఈగలు వాలకుండా పరిసరాలను ఫినాయిల్ లాంటి రసాయనాలతో శుభ్రం చేసి ఉంచుకోవాలని ఆదేశించారు. వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకొని శుభ్రత కచ్చితంగా పాటించాలన్నారు. ఇప్పటికే వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. పశువులను రోడ్లపైకి వదిలితే పట్టుకుని గోశాలలకు తరలిస్తామని యజమానులను హెచ్చరించారు. మున్సిపల్ డీఈ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సచివాలయ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మాంసం వ్యాపారులు పాల్గొన్నారు.



మాంసం వ్యాపారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

మన్యం వీరుడికి నివాళి



ఆదోని మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది

ఆదోని టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారికి ఎదురొడ్డి 27 ఏళ్ల అతి చిన్నవయస్సులోనే అసువులుబారిన గొప్ప నాయకుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. ఆయన సేవలు, ఆశయాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో శానిటేషన్, మెప్మా, టీపీఓ, ఇంజనీరింగ్, మేనేజర్, రెవెన్యూ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్వాతంత్ర్య ఉద్యమ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధ్యాపకులు న్యూటర్‌రాజు, డాక్టర్ హెచ్.కిరణ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాటలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి విజయగాథను విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకుడు

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర డ్యాంకు వరద మరింత పెరిగింది. బుధవారం 10 వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో గురువారం 17,750 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 12 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్ ఫ్లో 273 క్యూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1588.84 అడుగుల వరకు నీరు చేరాయి. ఇన్నాళ్లు నిరాశ కలిగించిన ఇన్‌ఫ్లో కొద్ది రోజులుగా వేగం పుంజుకుంటుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శివమొగ్గ, తీర్థనహళ్లీ, చిక మంగళూరు, వరనాడు, శృంగేరి తదితర డ్యాం ఎగువ భాగంలోని ప్రాంతాల్లో బాగానే వర్షాలు కురుస్తుండడంతో నీటి చేరిక పెరుగుతోంది. దీంతో కర్ణాటక, ఆంధ్రాకు సంబంధించి దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆయకట్టు రైతులు వరుణుడి కరుణించి తొందరగా రిజర్వాయర్ నిండాలని మొక్కుకుంటున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గోనెగండ్ల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోనెగండ్ల వైద్యాధికారిణి రంగ రవళి సూచించారు. గోనెగండ్లలో గురువారం డాక్టర్ రంగ రవళి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది డెంగ్యూ వ్యాధి నివారణపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మురుగునీటి గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు నివాసం ఏర్పర్చుకుంటాయని చెప్పారు. మురుగు నీరు ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందును పిచికారీ చేయించాలన్నారు. అలాగే ఇళ్లలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచుకోరాదని చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తిక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గోనెగండ్లలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



కర్రను పాతి విద్యుత్ సర్వీస్ వైర్ కనెక్షన్ తీసుకున్న దృశ్యం



ఆరు నెలల క్రితం తెచ్చిన విద్యుత్ స్తంభంపై మొలచిన గడ్డి

కర్రలే ఆధారం

కౌతాళం: మండలంలో విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వీడడం లేదు. స్థానిక ప్రతిభ హైస్కూల్ పక్కన ఓ ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం కర్రలు పాతి వాటి ద్వారానే సర్వీస్ వైర్‌ను తీసుకున్నారు. ఇక్కడ స్తంభం ఏర్పాటు చేయాలని ఆ ఇంటి యజమానురాలు దేవమణి ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో ఆరు నెలల క్రితం విద్యుత్ స్తంభాన్ని తరలించి అక్కడ ఉంచారు. అంతే తప్ప ఇప్పటివరకు స్తంభాన్ని పాతి కనెక్షన్ ఇవ్వకపోవడంతో నేటికి కర్రలపైనే సర్వీస్ వైర్ ఉంది. వర్షాలు, ఈదురుగాలులు వచ్చినప్పుడల్లా సర్వీస్ వైర్ కర్రలు విరిగినా, కింద పడినా వాటిని సరి చేయడానికి ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పినా ట్రాన్స్‌కో అధికారులు స్పందించడం లేదని దేవమణి వాపోయింది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టి స్తంభాన్ని పాతి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది.